కథానిక

# మాతృవాత్సల్యం

"వల్లపురెడ్డి"

"ఇది నాది."

"ఊహుఁ! ఇది నాది."

"అమ్మా, చూడవే!"

"అమ్మా, చూడే!"

ప్రాంగణంలో బాబిగాడు, అరుణ పోట్లాడుకుంటున్నారు బొమ్మలపుస్తకమొకదానిని పట్టుకుని. వారి గోల ఇంటికప్పు ఎగిరిపోయేంతగా మారింది. ఇంకా కొంచెం సేపట్లో దెబ్బలాటకు దిగే సూచనలున్నాయి.

వంటింట్లో నాన్చిన ఉల్లిగడ్డలమీద పొట్టు తీస్తూన్న కిష్టమ్మ అన్నం వార్చువేస్తూన్న కూతురు మణితో "అమ్మాయీ మణీ, ఆ ఈటె ఇక్కడ తెచ్చిపెట్టి, కొంచెం బయటికెళ్ళి చూడమ్మా నీ కూతురూ, బాబిగాడు పోట్లాడుకుంటున్నట్లున్నారు. వాడు రోజురోజుకు మరీ పోకిరై పోతున్నాడు. మొన్ననే దాని తల చిల్లిపడేట్లు గాయపరిచాడు"అంది.

మణి అన్నం వార్చువేసి, ఈటె తెచ్చి తల్లి ముందుంచి బయటికి వచ్చింది. తల్లినిచూసి అరుణ, "అమ్మా చూడే, బాబిగాడు నా పుస్తకం ఇమ్మంటే ఇయ్యడు." అని ఫిర్యాదుచేసింది.

బాబిగాని ముఖంలో నైరాశ్యపు ఛాయలావరించినయి; తనపక్షంలో మాట్లాడటానికెవరూ రాకపోయారని. సమీపిస్తూన్న అరుణ తల్లిని చూసి వానికి ఆశ లెగిరిపోయినై. విజయలక్ష్మి తన చేతుల్లోంచి జారిపోనున్నదని. పనిమీద బయటికి వెళ్ళిన బాబిగానితల్లి, భారతి అప్పుడేరావటం తటస్థించింది. ఉడిగిపోతూన్న బలం వానిలో రెట్టింపయింది. "అమ్మా చూడవే, నాన్న తెచ్చిన బొమ్మల పుత్తకం గుంజుకుంటుందిదీ!" అంటూ పుస్తకాన్ని లాగాడు. అరుణ పట్టువదలలేదు.

మణి వాళ్ళను సమీపించి అరుణ చేతుల్లోంచి పుస్తకాన్ని లాక్కుని బాబిగాని వైపు విసిరింది. "నీ కెన్నిసార్లు చెప్పాలే, వాడి జోలికి పోవద్దని? వాడసలే పోకిరీ వెధవ." అంటూ కోపంతో కూతుర్ని ఈడ్చుకు వెళుతూ చెంపమీద ఒకటి చరిచింది. అరుణ ఏడ్పు మొదలెట్టింది. తల్లిముఖంలోకి చూస్తూ బిక్కుబిక్కుమంటూంది. మణి బాధపడింది. కూతురి దైన్యంచూసి వెంటనే ఎత్తుకుని ఎదకాన్చుకుని ఓదార్చ ప్రయత్నిస్తూంది వీపుపైన మృదువుగా తడుతూ.

ఆ దృశ్యాన్ని చూసి భారతి సహించలేకపోయింది. పుస్తకాన్ని తీసుకుని సంతోషంతో ఎదురుగ్గా వస్తున్న కొడుకునెత్తుకుని "అవునమ్మా, మేం పోకిరీవాళ్ళం; వీడు వెధవే. సరేనా? అందుకే మూడు సంవత్సరాలు కావస్తూంది, మీ బరువు మోస్తున్నాం." అంది.

అక్కగారి మాటల్లోని అర్థాన్ని గ్రహించిన మణి "నిన్నెవరూ ఏమీ అనలేదమ్మా. నా కూతుర్ని నేను తిట్టుకున్నా."అని కొంచంఆగింది.

"మాటలు మార్చటానికి మాకు చేతగాదమ్మా. ఇప్పుడు తిట్టి, అప్పుడే లేదంటారు. పోకిరీవాళ్ళ సాంగత్యంలో మంచివాళ్ళు కూడా చెడిపోతారు. మా గాలి సోకకుంటా ఉండటమే మంచిది." ఎర్రబడిన ముఖంతో అంది భారతి.

పిల్లల అల్లరి తక్కువై పెద్దవాళ్ళగొంతులు విన్పడేసరికి వంటింట్లో ఉల్లిగడ్డలు తరుగుతూన్న కిష్టమ్మకు బయటికి రావటం తప్పలేదు. భారతి కటువుగా మాట్లాడినందుకు మనసొచ్చుకుని కంటతడిపెడుతూ భారంగాఅడుగులేసుకుంటూవస్తూన్న చిన్నకూతురు మణిని చూసి ఆమె హృదయం బాధావహమై పోయింది. వదనం మ్లానమైంది. "పిల్లలమూలంగా మీ రెందుకే వాదించుకుంటున్నా రనవసరంగా? వాళ్ళీక్షణం పోట్లాడుకుంటే మరుక్షణమే నవ్వుకుంటారు. పెద్దవాళ్ళు ఈ విషయం తెలిసీ, మూర్ఖత్వంలో పడితే ఎవరు చెబుతారు? అమ్మాయి భారతీ, పెద్దదానివి నీకైనా సహనముండొద్దా? నీవు మాటమాటకి చెల్లాయిని కఠినంగా మాట్లాడడం

బావుండలేదు. దాని గుండె ఇప్పటికే గాయపడి ఉంది. దానిమీద నీవింకా ఉప్పు చిలకరించి దాని జీవితం బరువుచెయ్యకు. కొంచెం నిలువ నీడ నియ్యి దానికి" అందామె వేదనను భరించలేక.

తల్లి మాటలను విని పొంగివస్తూన్న దుఃఖాన్నణచుకోలేక పోయింది మణి. "అమ్మా!" అంటూ ఆమె ఒడిలో వాలింది వెళ్ళి. కిష్టమ్మ కూతురు చంకలోంచి అరుణ నెత్తుకుంది. "ఊరుకోవే, నువు మరీ. పెద్దదేదో అంటే ఇంత పట్టింపా?" అంది కూతుర్నోదారుస్తూ.

"నిలువనీక బజారుకు తరిమేందుకు నే నెవర్నమ్మా? అనటానికి వాళ్ళకే తగు; ఏడ్వటానికీ వాళ్ళకే తగు. మీరు మీరంతా మంచివాళ్లే. మధ్యన నేనే అందరికీ చెడ్డదాన్ని" అంటూ భారతి అక్కడ్నుంచి పెరట్లోకి వెళ్ళింది.

కిష్టమ్మకు ఉన్న సంతానం ఆరుగురు. అంతాఆడవాళ్ళే. మధ్యలో ఇరువురు మగపిల్లలు కలిగినా దక్కలేదు. భారతి అందరికంటే పెద్దది. రెండోది మణి. మూడు, నాలుగు సంతానాలు వరుసగా సీత, లక్ష్మి పెళ్ళిళ్ళయి సుఖంగా కాపురాలు చేస్తున్నా రత్తగారిళ్ళలో. మిగతా ఇద్దరు కూతుళ్ళు సరస్వతి, అలివేలు; పది, ఎనిమిదిసంవత్సరాల ఈడు. ఊరి వీధిబడిలో చదువుతున్నారు.

మగపిల్లలు కిటకపోవటంవల్ల కిష్టమ్మభర్త తాను బ్రతికుండగానే సాయీనాధ్‌ను దత్తతగా తీసుకుని భారతనిచ్చి వివాహం చేశాడు. వరునిగుణాలు నచ్చటంవల్ల మణిని ఒక సాధారణమైన సంసారానికి ముడిపెట్టాడు. తరువాత సంవత్సరంతిరక్కముందే అతను పరలోకగతుడయ్యాడు.

చనిపోతూ భర్త కిష్టమ్మకు ఒక భూగుప్త నిక్షిప్తం సంగతి రహస్యంగా చెప్పాడు. "మనకున్నది ఆరుగురు కూతుళ్లు. అందరూ సుఖపడటం మన ఆశయం. కాని విధి వింతలాస్యం ఎవరి సంసారచక్రాన్నెట్లా త్రిప్పుతుందో చెప్పలేం. ఏ కూతురైనా చెడివస్తే—పాపముపశమించుగాక—పెద్దమ్మాయి, దాని మొగుడూ తలదాచుకోటానికి చోటిస్తారో లేదో దానికి. అందుకే నీవీ నిక్షిప్తాన్ని ఏకూతురు సంసారం చెడితే ఆ కూతురుకివ్వు. ఇదే నా తుదిమాట" అన్నాడు.

కిష్టమ్మభర్త ఏపనిచేసినా ముందుకాలంమ్మీద దృష్టిఉంచి చేసేవాడు. కాని ఒకవైపున తానే వైవిధ్యానికి లొంగిపోతూ, విధిచేష్టితానికి ఉపశమనాన్ని నివేదించేప్పుడు తాను మానవమాత్రుడనే సంగతినే మరిచి పోయాడు పాపం! వైవిధ్యం వైరుధ్యభావం వహిస్తే తన నిక్షిప్తం, చెడిపోయిన సంసారాన్నెలా బాగుపరుస్తుందని నమ్మాడో!

భర్త చెప్పిన మాటల్లోని బలాన్ని పరీక్షించటానికి సమయమాసన్నమయ్యేసరికి కిష్టమ్మ చేతుల్లో ఆ భూగుప్త నిక్షిప్తం లేదు. ఆమె వర్తమానంలాగే భవిష్యత్తు కూడా ఉంటుందని తలపోసే మనిషి. మూడునాల్గు వత్సరాలు కాలచక్రంలో దొరలినయి. సీత, లక్ష్మిల పెళ్ళిళ్ళు జరిగేయి.

ఒకనాడు సాయీనాధ్ తను చేయ తలపెట్టిన గొప్ప వ్యాపారం సంగతి అత్తగారితో విన్నవించాడు. ఇంటికి పెద్ద మగదిక్కు అతడే కావటంవల్ల తను చేయదలచింది తప్పకుండా చేసేవాడు. పెద్దవాళ్ళతో యోచించటం అవసరం కాబట్టి ఏ పనిచేయదలచుకున్నా అత్తగారితో ఆలోచించేవాడు ఆమెకు తెలుసు తన సలహా అనుకూలమైనా, ప్రతికూలమైనా సాయీనాథ్ సంకల్పం మారదు. అందుకే అతడడిగే మాటలకు అనుకూలమైన సమాధానం తప్పితే ఏమీ ఇవ్వలేక పోయేది. సాయీనాధ్ అడిగిన వ్యాపారం విషయంలో ఆమె అనుకూలంగా తలాడించింది. ఆ వ్యాపారానికి తగినవిత్తం ప్రస్తుతానికి తనచేతుల్లో లేదని చెప్పాడు సాయీనాధ్. ఎక్కడేనా అప్పు దొరికితే ప్రయత్నించమం దామె. ప్రయత్నాలన్నీ విఫలమైనాయన్నా డతడు. మాటలవరుసలో భూగుప్త నిక్షిప్తం పూచీ ఎత్తాడు. ఆ సంగతి సాయీనాధ్‌కు ఎట్లా తెలిసిందో ఆమె ఊహకందలేదు. కాని తరువాత కొన్నాళ్ళకు తెలిసి వచ్చింది; భర్త ఆ రహస్యం తనకొక్కదానికే గాక మరో వ్యక్తికి గూడా చెప్పాడని. అతడు ఆమె భర్తకు బాల్యంనుండీ బహిఃప్రాణంగా మెలగిన రామస్వామి, అతడే సాయీనాధ్‌కు ఈ రహస్యం చెప్పి ఎలాగైనా అత్తగారి అనుజ్ఞపొందమని చెప్పాడు. ఆ విత్తం కిష్టమ్మ చేతిలోంచి వదిలించాలని అతని అభిమతం కాదు. రామస్వామి గతించిన మిత్రునిపట్ల ప్రదర్శించిన శ్రద్ధాభక్తులే సాయీ

నాథ్‌కూ చూపాడు. ఆదినుంచీ అతడా కుటుంబానికి హితుడు. చేయనున్న వ్యాపారంతో సంసార మూలధనం పెరగటానికి అవకాశాలున్నందున, ఆ సమయంలో భూగుప్త నిక్షిప్తం సాయపడాలని అతని ఆశ. ఆ ధనం దాచిన స్థలం తనకు తెలిసినప్పటికీ రామస్వామి సాయీనాథ్‌కు చెప్పలేదు. కిష్టమ్మ అనుమతిమీద అది ఉపయోగపడాల్సిందే కాని తనే ఆ రహస్యం పూర్తిగా కక్కి తరువాత ఏదైనా విపత్తు వస్తే దానికి తాను బాధ్యుడయి గత మిత్రుని స్నేహ తిరస్కారాన్ని పొంద తలచలేదు.

కిష్టమ్మ ఆలోచించింది. కూతుళ్ళందరూ సంసారాలను సాఫీగా నడుపుకుంటున్నారు. భర్త ఇచ్చిపోయిన విత్తంతో ఎవ్వరికీ అవసరం లేనట్లుగానే ఉంది. ముందు ముందుకూడా దాంతో ఎవ్వరికీ ఏ అవసరమూ లేకపోతే అది భూమిలోనే లీనమైపోవాల్సివస్తుంది. ఇప్పుడైనా తను ధనాన్ని ఎవరో పరాయివాళ్ల కివ్వటంలేదే! తన కూతురికే ఇస్తూంది. కూతురు సంసారాభివృద్ధికే సాయపడుతుంది. ఇంత విశాలంగా ఆలోచించి ఆమె ధనాన్నంతా సాయినాథ్ హస్తగతం చేసింది. ఈ ఘటన జరిగి మూన్నెళ్లయినా ముగియకముందే రెండో కూతురు మణివిధవ అయివచ్చి ఇంట్లో కూర్చుంది—రెండు సంవత్సరాలు దాటుతూన్న అమ్మాయి అరుణతో మణి భర్త ఎంత మంచివాడో అంత అమాయకుడు. అతని అమాయకత్వాన్ని కొందరు స్నేహితులనబడేవారు దుర్వినియోగం చేసుకొన్నారు. అతనికున్న పలుబడిని తాకట్టుపెట్ట రహస్యంగా ప్రభుత్వ ధనాగారంలోంచి కొంత డబ్బు కాజేశారు. ఆ నేరం కాస్తా ఆఖరుకు అతని మీదనే పడింది. తన్మూలంగా అతని ఆస్తి పాస్తులన్నిటినీ ప్రభుత్వం వశపరచుకుంది. అవమానం భరించలేక అతడాత్మహత్య చేసుకొన్నాడు.

బాలకృష్ణ మణికి మరిది. అన్నయ్య ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త విని గుండెబ్రద్దలయ్యేటట్లు శోకించాడు. అతడప్పుడు పట్టణంలో చదువుతున్నాడు. వదినతో కలిసి దుఃఖించడంకంటే ఏమీ చెయ్యలేక పోయాడు. వదినకు, అరుణకూ తన జీవితం ధారపోయటమే కర్తవ్యంగా నిర్ణయించుకుని, వదినను పుట్టింట్లో దిగవిడచి నగరం వెళ్లాడు ఉద్యోగాన్వేషణకు ఆ సంవత్సరం ఎట్లో తిప్పలుపడి బి. ఏ చదువు పూర్తిచేసి ఎక్కడేనా తగిన పని లభిస్తుందేమోనని తిరగసాగాడు.

మణికి ఎదురైన దురదృష్టానికి కిష్టమ్మ విచారించింది. దూరం ఆలోచించలేక భర్త మాటను త్రోసిపుచ్చినందుకు బాధపడింది. మణికి ఆ ఇంటికి వచ్చిన మొదటి సంవత్సరం కొంచం శాంతంగానే నడిచింది. కాని భారత హృదయం సోదరిని ఎల్లకాలం సహించేదికాదు. రానురాను ఆమె మణితో పేచీపడటం ప్రారంభించింది. వాళ్ళమధ్య జరిగే ప్రతి చిన్న కలహానికీ కిష్టమ్మ కుమిలిపోవటం తప్ప ఏమీ చేయగలిగేది కాదు.

ఒకసారి వదిననూ, అమ్మాయినీ చూట్టానికి వచ్చి బాలక్రిష్ణభారతి ప్రవర్తనను పసికట్టివెళ్ళారు. తన అసమర్థతను నిందించుకున్నాడు. అడ్డమైన కార్యాలయాలన్నీ తిరుగుతున్నాడు తనూ వదినా అరుణ నాలుగు మెతుకులు తినగలిగే ఉద్యోగం ఏమైనా దొరుకుతుందేమో అని.

మణి భారతితో పడుతున్న సంఘర్షణలు చూడలేక ఒకటి రెండు మార్లు సాయీనాథ్‌తో "మణి ఎన్నాళ్ళని ఈ ఇంట్లో ఉంటుంది? దాని మరదికి ఏదో ఒక వ్యాపారం పెట్టిస్తే వాడి వదినను వాడు పోషించుకుంటాడు. కలిసివస్తే మనది మనకు చెల్లిస్తాడు." అని చెప్పిచూసింది కిష్టమ్మ. కాని లాభం లేకపోయింది. "మనకు మాత్రం ఇప్పుడు చేతిలో వానికి వ్యాపారం పెట్టించేంత రొక్కం ఎక్కడుంది? అంతా ఆసామీలచేతుల్లో చిక్కువడిపోయింది. మీకు తెలియని సంసారమా అత్తగారూ! అయినా. మణికి ఇక్కడొచ్చిన లోటేమిటి?" అన్నాడు సాయినాథ్.

సాయీనాథ్ సమాధానాన్ని విన్నప్పుడల్లా ఆమెకు తను దూరదృష్టి లోపించి చేజారవిడుచుకున్న నిక్షిప్తం జ్ఞప్తికొచ్చేది.

ఈ పరిస్థితుల్లో క్రిష్ణమ్మ చేతిలో చిల్లిగవ్వ లేదు. ఒంటిమీది నగలన్నీ ఒలిచి పెద్ద కూతురు సంసార హోమంలో పోసింది. ఇక చేతులకు బంగారు గాజుల జత మాత్రమే. అది ఎంత కొట్టుమిట్టాడినా రెండువందల కెక్కువ విలువచెయ్యదు. దాన్ని మణి జీవితంలో మార్గం కల్పించటానికి వినియోగించినా లాభంలేదు. రెండు రోజుల్లో

తుదముడుతాయి. పైగా నలుగురు చూసే వాళ్ళకీ నవ్వులాట.

రెండున్నర సంవత్సరాల తరువాత మరిది దగ్గర్నుంచి ఉత్తరంవచ్చింది మణికి: నగరం నుంచి వ్రాశాడు.

వదినా.

భగీరథ ప్రయత్నంచేశాక ఇక్కడొక కార్యాలయంలో ఉద్యోగం దొరికింది. నెలకు వంద యాభైరూపాయలు. మనకు కడుపు నింపేందుకు సరిపోతుంది. వారం రోజుల్లో వస్తున్నా. సిద్ధంగా ఉండు. అమ్మకు నమస్కారాలు చెప్పు.

నీ పుత్రసమానుడు, బాలకృష్ణ.

బాలకృష్ణకు ఉద్యోగం దొరికిందని తెలియగానే కిష్టమ్మలో ఆనందం పరవళ్ళు త్రొక్కింది. ఇకనుంచైనా మణి కొంచం శాంతిగా గడుపుతుంది తన జీవిత శేషాన్ని అని తృప్తిపడింది.

బాలకృష్ణ వదిన్ని తీసుకుపోవటానికి వచ్చాడు. ఎవ్వరూ కాదనలేదు. కొద్ది రోజులుండి వస్తానని కిష్టమ్మ కూడా ప్రయాణమైంది. సాగనంపుతూ భారతి, మణినిచూసి "మళ్ళీ ఎన్నడొస్తావు చెల్లీ" అనీ, తల్లిని "త్వరగా రామ్మా" అనీ మాట వరుసకనేసింది. కాని ఆమె మనస్సులో మాత్రం పీడవిరగడై పోతూందన్నట్లుగానే ఉంది. వాళ్ళు వెళ్ళిపోయారు.

నగరం వెళ్ళిన నాల్గు రోజులకే కిష్టమ్మ ప్రయాణమైంది తిరిగి రావటానికి. "వస్తాను బాబూ!" అంది బాలకృష్ణ నుద్దేశించి.

"ఎక్కడికి వెడతావమ్మా?ఇక్కడేంలోటూ?"

"లోటు మాట కాదుబాబూ. కాని అక్కడ వాళ్ళు ఎదురు చూస్తుంటారు. మళ్ళీ వస్తాను ఎన్నడైనా."అంది.

"అక్కడ నీ కొరకు ఎదురుచూసేవాళ్ళు ఎవరూ లేరమ్మా. వాళ్ళవి నీ అంత మెత్తని మనస్సులు కావు." అని కోపం వెళ్ళబుచ్చాడు.

"అట్లా అనకు నాయనా, వాళ్ళూ మీలాంటి వాళ్ళే." అంది కంట తడిపెడ్తూ.

"ఆ! అంతా మనుషుల్లోనే తేడాలు. నేనేమీ చెప్పలేనమ్మా. వదిన్ని అడిగి ఆమె ఒప్పుకుంటే వెళ్లు." అన్నాడు ఇష్టంలేక.

"దానికేం నారక్తం కనుక అది నన్ను వెళ్ళమనదు..." ఇంకా ఏమో చెప్పబోయి ఏదో జ్ఞాపకంవచ్చి మధ్యలోనే ఆగిపోయింది. బాలకృష్ణ గ్రహించాడు ఆమె అర్థోక్తిలో ఎందుకు ఆగిపోయిందో.

"అవును రక్తం ఒక్కటికనుకనే ఇన్నాళ్ళూ నరకయాతన లనుభవించారు. రక్తం కాదమ్మా మనుష్యుల్లో ప్రేమబంధాల్ని స్థిరీకరించేది. అభిమానమూ, పూజ్యభావం, ఆమాటకొస్తే మానవత్వం" అంటూ ఆవేశంతో ఆగదివీడి అవతలికెళ్లాడు. అరుణనెత్తుకుని నిల్చునిఉన్న మణితో "అమ్మా, నువ్వు చెప్పు ఒదినా." అన్నాడు బ్రతిమాలుతూ.

మణి మరిది మాటను కాదనలేక పోయింది. కిష్టమ్మ అక్కడే ఉండిపోయింది. సాయినాథ్ దగ్గర్నుంచిగాని, భారతి దగ్గరుంచిగాని ఒక్క ఉత్తరంకూడా రాలే. పదినెల్లు తిరిగినయి. ఒక నాడు మాటల సందర్భంలో భారతి ప్రసక్తితెచ్చి "చూశావా అమ్మా నీరక్తంలో ఎంత వాత్సల్యముందో," అన్నాడు బాలకృష్ణ కిష్టమ్మతో.

కొన్నాళ్ళకు సాయీనాధ్‌నుంచి ఉత్తరం వచ్చినది, భారతికి క్షయ వచ్చిందనీ, శానిటోరియంకు తీసుకు వెడుతున్నామని కిష్టమ్మ హృదయం కంపించింది. వెళ్ళటానికి తీర్మానించుకుంది.

"మీరు వెళ్ళటం సమంజసమనిపించటం లేదమ్మా క్షయ అంటువ్యాధి" అన్నాడు బాలకృష్ణ.

"క్షయ ఒక్కటేకాదు బాబూ, మమకారం కూడ అంటువ్యాధే. క్షయకంటే బలీయమైంది."

అతని నోరు మూగపడి పోయింది. ఆమె ప్రయాణానికి సన్నాహాలు చేశాడు.

అరుణను తీసుకుని తల్లితోబాటు ప్రయాణమైన వదిననుచూసి బాలకృష్ణకు భయంతో శరీరమంతా వణకింది. ఆమె వదనంలో అక్కపైగల వాత్సల్యం, తత్కారణజనిత వేదనా ప్రస్ఫుటమవుతున్నాయి. తన్నుతాను స్థిమితపరచుకుని "నేను అభ్యంతరపెట్టనమ్మా వెళ్ళిరండి. జాగ్రత్త కొంచం. అరుణ వుంటుంది."

వారంరోజుల తరువాత ఉత్తరం వచ్చింది. మణి వ్రాసింది మైసూరునుండి అందులో భారతిని

శానిటోరియంలో చేర్పించినట్లు, చికిత్స చేయిస్తున్నట్లు మాత్రమే ఉంది. కాని ఆమె ఎన్నడోస్తూన్న సంగతిలేదు. బాలకృష్ణ మరోఉత్తరం ఉత్తరక్షణమే వ్రాశాడు వదినకు; త్వరగా రమ్మని.

ఉత్తరం వ్రాసిన నాలుగోరోజున కబురు చెయ్యకుండానే మణి, అరుణతో నగరం వచ్చేసింది. "అమ్మ రాలేదెందుకమ్మా?" ఆత్రంతో ప్రశ్నించాడు బాలకృష్ణ.

"అక్కను ఆస్థితిలోఉంచి తాను రానంది. నన్నుమాత్రం పంపింది. నెమ్మదించిన తరువాత తప్పకుండా వస్తానంది" అన్నది మణి.

"రోగికి పరిచర్యలు అమ్మే చేయాలా?"

"ఎవరికి తప్పినా తల్లికి తప్పుతుందా?"

బాలకృష్ణ ఏమీ అనలేదు. ఆమె మమకారం అదంతా, అని తెలుసు అతనికి. కాని నిర్హేతుకమైందని తీర్మానించుకున్నాడు.

ఆరు నెలలు కావస్తూంది. మణి ఉత్తరాల ద్వారా అక్కగారి క్షేమాన్ని తెలిసికుంటూనే ఉంది. అమ్మనుంచి వచ్చిన ఆఖరి ఉత్తరంలో భారతికి నెమ్మదించిందనీ త్వరలోనే ఇంటికి వెళుతున్నట్లు ఉంది.

అత్తగారికి కొన్నాళ్ళనుంచి సుస్తీగా ఉందని, క్షయలక్షణాలు కన్పిస్తున్నాయనీ సాయినాథ్ నుంచి లేఖవచ్చింది. బాలకృష్ణ వదిన్ను వెంబడించుకుని వెళ్లాడు. అక్కడ ఆమె దీనదశలోఉంది. మనిషి సగంలో సగంలేదు. భారతి కొద్దిరోజులనుంచి తనకు శానిటోరియంలో అహారహమూ అన్నపానీయాలు మాని చేసినసేవకు బదులుగా, ఏ అణువంత కనిపెడ్తూందో కాని అప్పుడే మూతి విరుపులు ప్రారంభించింది. మణి అక్కగారి గోణుగుడు విని చాటుగా మరిదితో అంది; అమ్మను నగరం తీసుకువెడదామని బాలకృష్ణ ఒప్పుకున్నాడు. సాయినాథ్‌తో "అన్నయ్యా అమ్మను నగరం తీసికెళ్ళి మంచి డాక్టరు కెవరికైనా చూపిస్తాను." అని అడిగాడు. సాయినాథ్ సరేనన్నాడు.

కిష్టమ్మను స్టేషనుకు బండెక్కిస్తూ సాయీనాథ్ ఒక ఏభైరూపాయలు బాలకృష్ణచేతులో ఉంచబోయాడు. "వద్దన్నయ్యా, అవసరమైతే ఉత్తరం వ్రాసి తెప్పించుకుంటానులే." అని చెప్పాడు.

కిష్టమ్మను నగరం తీసికెళ్ళినతరువాత బాలకృష్ణ డాక్టర్లకు చూపించాడు. క్షయ. అతడప్పుడే అనుకున్నాడు ఆమెవాత్సల్యాన్ని ధారవోసి మృత్యువును కొని తెచ్చుకుందని, హాస్పిటల్‌లో చేర్చటానికి సీట్లులేవు. డాక్టర్లచేత మందులిప్పించాడు. మూడు నెలలుదాటినయి. డాక్టర్లు ఇక లాభంలేదన్నారు.

ఖర్చులు పోగా మిగిలిన డబ్బు బ్యాంకులో జమకట్టాడు బాలకృష్ణ అది అంతా అయిపోయింది. మణి అక్కకు ఒకమారు ఉత్తరం వ్రాసింది. అమ్మను శానిటోరియంకు తీసుకు వెడదామని ప్రత్యుత్తరం వచ్చింది. "వారు చేతిలో కానీ లేదంటున్నారు. శానిటోరియంకి వెళితే ఖర్చులు చాలా అవుతాయి." అని ఉత్తరాన్ని చూసిన వేడి నిట్టూర్పువిడిచింది. బాలకృష్ణ క్రోధం, అసహ్యంతో ఉడికిపోయాడు. అమ్మ బాధపడుతుందదే అభిప్రాయంతో మణి దాచిపెట్టింది.

కిష్టమ్మకు ఆఖరిరోజులు. "బాబూ, సీత, లక్ష్మి ఇద్దరూ పుట్టింటిలోనే ఉన్నట్లుచెప్పారుగదూ ఆ మధ్య మీరు?" ప్రక్కనే నిల్చుని ఉన్న బాలకృష్ణను ప్రశ్నించింది. అవునన్నాడతను. "అయితే నేనిక ఎక్కువ రోజులుండను. భారతికి ఉత్తరం వ్రాయి. వాళ్ళిద్దరినీ, చిన్నపిల్లలనిద్దరినీ తీసుకుని ఒకసారివచ్చి పొమ్మని చూడాలనుంది వాళ్ళను." అందామె."

చిన్నపిల్లల్నిద్దరినీ తీసుకుని సీత, లక్ష్మి వచ్చేశారు. భారతి రాలేదు. "పెద్దదిరాలేదా?" అని ప్రశ్నించింది బరువుగా.

"అవును. ఇంటిదగ్గర ఎవ్వరూలేరట. క్షమించమంది." సమాధానించారు సీత, లక్ష్మి. బాలకృష్ణ భారతిని గూర్చి ఆలోచించ సాగాడు—ఏ జాతికి చెందిన వ్యక్తి ఆమె అని. చుట్టూచేరిన అయిదుగురు కూతుళ్ళను ఆశీర్వదించింది. "భారతికి చెప్పండి—దాన్ని తలుస్తూ ప్రాణం విడిచానని."

ఆఖరు క్షణంలో ఒక కాగితంతీసి బాలకృష్ణకిచ్చి పరలోకం చేరింది కిష్టమ్మ. బాలకృష్ణదాన్ని విప్పిచూశాడు. అది వీలునామా. అందులో తన చేతికున్న బంగారు గాజుల జతను భారతిపేర వ్రాసి పోయింది. తన భర్త చనిపోతూ చెప్పిన మాట ప్రకారం చెడిపోయిన కూతురికై దాన్ని వినియోగించిందట! ★